సాక్షి

శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం । 19 । మార్చి । 2025




టన్ను చీనీ రూ.25,650

అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.25,650, కనిష్టంగా రూ.6,660 ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.9

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.9, కనిష్టంగా రూ.7 ప్రకారం ధర పలికింది.



న్యూస్‌రీల్

క్వింటా ఎండుమిర్చి రూ.15 వేలు



మార్కెట్‌కు వచ్చిన ఎండు మిర్చి

హిందూపురం అర్బన్: ఎండుమిర్చి ధరలు నిలకడగా కొనసాగుతున్నాయి. హిందూపురం వ్యవసాయ మార్కెట్‌కు మంగళవారం 93 క్వింటాళ్ల ఎండుమిర్చి రాగా, అధికారులు ఈ–నామ్ పద్ధతిలో వేలం పాట నిర్వహించారు. ఇందులో క్వింటా గరిష్టంగా రూ.15 వేలు, కనిష్టంగా రూ.7 వేలు, సరాసరిన రూ.7,200 ప్రకారం ధర పలికినట్లు మార్కెట్ కార్యదర్శి జి. చంద్రమౌళి తెలిపారు.

ఎక్సైజ్ శాఖలో పదోన్నతులు



కర్నూలు: ఎక్సైజ్ శాఖలో పదోన్నతులకు రంగం సిద్ధమైంది. ఫోర్త్‌జోన్ పరిధిలో మొత్తం 52 పోస్టులు ఖాళీగా ఉండగా 48 మంది హెడ్ కానిస్టేబుళ్లు, క్లర్కులకు అడ్‌హాక్ పద్ధతిలో ఎస్‌ఐలుగా పదోన్నతి కల్పించి పోస్టింగులు కేటాయించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డైరెక్టర్ నుంచి ఇటీవల జిల్లా కేంద్రానికి ఉత్తర్వులు అందాయి. ఈ మేరకు డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. గ్రూప్–2 పోస్టులే అయినా అడ్‌హాక్ పద్ధతిలో పదోన్నతికి రంగం సిద్ధం చేయడం గమనార్హం. ఈ క్రమంలోనే సర్వీస్ రిజిస్టర్ల పరిశీలన పూర్తి కావడంతో ఈ నెల 20, 21 తేదీల్లో క్లర్కులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించేందుకు తూనికలు, కొలతల శాఖ అధికారులకు డిప్యూటీ కమిషనర్ లేఖ రాశారు. సీమ జిల్లాల్లో 12 మంది క్లర్కులు ఎస్‌ఐలుగా పదోన్నతి పొందేందుకు జాబితా సిద్ధమైంది. వైద్యపరీక్షల అనంతరం పదోన్నతి కల్పించి ఈ నెలాఖరులోగా పోస్టింగులు కేటాయించే అవకాశమున్నట్లు ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు.

జెడ్పీలో పదోన్నతులకు సన్నాహాలు



అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ పరిధిలో పని చేస్తున్న పలువురు ఉద్యోగులకు పదోన్నతులు కల్పించేందుకు రంగం సిద్ధమైంది. సీఈఓ రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఈఓ జి.వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో జెడ్పీలోని ప్రత్యేక బృందం సీనియారిటీ జాబితా రూపకల్పనలో నిమగ్నమైంది. జిల్లా పరిషత్ కార్యాలయంతో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మండల పరిషత్ కార్యాలయాలు, ఉన్నత పాఠశాలలు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ విభాగాల్లో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిస్టెంట్లు, ల్యాబ్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించనున్నారు. తొలుత సీనియారిటీ, రోస్టర్ ప్రకారం ముసాయిదా జాబితా తయారు చేసి సీఈఓ పరిశీలన అనంతరం అభ్యంతరాలు స్వీకరిస్తారు. అభ్యంతరాలు లేవనిపిస్తే.. తుది జాబితాను సిద్ధం చేసి చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ఆమోదంతో అర్హులైన వారికి పదోన్నతులు కల్పించి పోస్టింగ్‌లు ఇస్తారు.

పుట్టపర్తి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (పుడా) చైర్మన్ పదవి హాట్ టాపిక్‌గా మారింది. పదవి కోసం కూటమి పార్టీల నేతలు పోటాపోటీగా విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. టీడీపీ నేతలైతే ఏకంగా అమరావతిలోనే మకాం వేసి లోకేష్ మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. తాజాగా మాజీ మంత్రి రంగంలోకి దిగారు. ప్రొటోకాల్ సమస్య తీరడంతో పాటు అదనపు ఆదాయం సమకూర్చుకునేందుకు పుడా చైర్మన్ గిరీ కోసం ప్రయత్నిస్తున్నారు.



పుడా గిరి.. ఎవరికో మరి!

నేతలను ఊరిస్తోన్న ‘పుడా’ చైర్మన్ పదవి

- జాప్యంపై ఆశావహుల అసంతృప్తి
- ప్రొటోకాల్ కోసం మాజీ మంత్రి ఆసక్తి
- అధిష్టానం వద్ద నేటికీ తేలని పంచాయితీ
- వైఎస్సార్‌సీపీ హయాంలో బీసీలకు చైర్మన్ గిరి
- కూటమి సర్కారులో ఎవరిని వరిస్తుందో తెలియని స్థితి

సాక్షి, పుట్టపర్తి

పుట్టపర్తి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (పుడా)పై ఇప్పుడు అందరి కళ్లూ పడ్డాయి. దాదాపు ఆరు మండలాలు విస్తరించి ఉన్న ‘పుడా’ పీఠం దక్కితే దాదాపు పుట్టపర్తి నియోజకవర్గమంతా చేతిలో ఉన్నట్లే. ప్రొటోకాల్‌తో పాటు కీలకమైన నిర్ణయాల్లోనూ ‘పుడా’ చైర్మన్ పాత్ర తప్పకుండా ఉంటుంది. వైఎస్సార్‌సీపీ హయాంలో చైర్మన్‌గా ఉన్న లక్ష్మీనరసమ్మ.. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే స్వచ్ఛందంగా రాజీనామా చేయడంతో ఆ నామినేటెడ్ పోస్టు ఖాళీ అయ్యింది. దీంతో కూటమి నేతలందరి గురి ‘పుడా’ గిరిపై పడింది.

రేసులో మాజీ మంత్రి

కూటమి ప్రభుత్వం విడతల వారీగా నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తూ వస్తోంది. అయితే ఇప్పటి వరకు పుట్టపర్తి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (పుడా) చైర్మన్‌పై స్పష్టత ఇవ్వలేదు. పుట్టపర్తి నుంచి ఒకప్పుడు మంత్రిగా పని చేసిన సీనియర్ నేత ‘పుడా’ చైర్మన్ పదవి ఆశిస్తున్నారని తెలిసింది. అధికార దాహంతో నిత్యం ప్రభుత్వ కార్యాలయాల్లో సమీక్షలు చేస్తూ విమర్శల పాలవుతోన్న ఆయన ‘పుడా’ చైర్మన్ పదవి వస్తే.. ప్రొటోకాల్ పంచాయితీ ఉండదనే భావనలో ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఎవరికో ఇవ్వడం ఎందుకు? తానే ‘పుడా’చైర్మన్ పదవి తీసుకుంటే తప్పేంటని సన్నిహితులతో చర్చించారని సమాచారం. ఈ క్రమంలోనే ఎవరికీ ఇవ్వకుండా.. జాప్యం చేస్తున్నారనే చర్చ జరుగుతోంది. మరోవైపు ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు అవుతున్నా..‘పుడా’ చైర్మన్‌గా ఎవరినీ ప్రకటించకపోవడంతో ఆశావహుల జాబితా రోజురోజుకూ పెరిగిపోతోంది.

అమరావతిలో ఆశావహుల మకాం

వైఎస్సార్‌సీపీ హయాంలో బీసీ కేటగిరీకి చెందిన మహిళకు పుడా చైర్మన్ పదవి కట్టబెట్టారు. ఈ క్రమంలో టీడీపీ నుంచి బీసీ కులాలకే ఇస్తారన్న ఆలోచనతో ఆశావహులు జోరు మీద ఉన్నారు. కొందరు యువ నేతలూ తెరపైకి వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇప్పటికే ఆశావహులు ఎవరికి వారుగా.. అమరావతిలో మకాం వేస్తున్నారు. నెలలో మూడు – నాలుగుసార్లు వెళ్లి నారా లోకేశ్‌తో లాబీయింగ్ చేస్తున్నారని తెలిసింది. అయితే స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి ప్రమేయం లేకుండా ‘పుడా’చైర్మన్ గిరీ ఎవరికీ దక్కదన్న విషయం తెలిసినా.. దీనిపై ఆమె ఇంతవరకు నోరు విప్పకపోవడంతో కుటుంబ సభ్యులకే ఇస్తారేమో అనే చర్చ జరుగుతోంది.

వైఎస్సార్‌సీపీ హయాంలోనే భారీ వృద్ధి

నగరం నుంచి మారుమూల గ్రామాల వరకు అభివృద్ధే లక్ష్యంగా పుట్టపర్తి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (పుడా) పరిధిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విస్తరించింది. 1992లో ఏర్పడిన ‘పుడా’ఆరు గ్రామాలకే పరిమితం కాగా.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు మండలాలకు విస్తరించింది. ఫలితంగా ‘పుడా’పరిధి 1417.13 చదరపు కిలోమీటర్లకు చేరింది. మొత్తం 82 రెవెన్యూ గ్రామాలు ‘పుడా’పరిధిలో ఉన్నాయి.

ప్రస్థానం ఇలా..

- 1992 ఫిబ్రవరి 18వ తేదీన పుడా (పుట్టపర్తి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) ఏర్పడింది. పుట్టపర్తి, కప్పలబండ, బ్రాహ్మణపల్లి, లోచెర్ల, బీడుపల్లి, ఎనుములపల్లి గ్రామాలు ‘పుడా’పరిధిలో ఉండేవి. మొత్తం 86.54 చదరపు కిలోమీటర్లు మేర విస్తరించి ఉండేది.
- 1996 సెప్టెంబరు 3వ తేదీన పుడా పేరును ‘సుడా’(శ్రీ సత్యసాయి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ)గా మార్పు చేశారు.
- తర్వాత 2007 ఫిబ్రవరి 28న ‘సుడా’పేరు తొలగించి మళ్లీ ‘పుడా’గా మార్చారు.
- 2022 మే 13వ తేదీన ఆరు మండలాలకు ‘పుడా’ను విస్తరించారు. పుట్టపర్తి నియోజకవర్గం మొత్తం (అమడగూరులోని ఐదు రెవెన్యూ గ్రామాలు మినహా) పుడా పరిధిలోకి తీసుకొచ్చారు. ఫలితంగా 1,407.87 చదరపు కిలోమీటర్లు విస్తరించింది.
- తర్వాత 2022 నవంబరు 7వ తేదీన అమడగూరు మండలంలోని చీకిరేవులపల్లి, దడెంవారిపల్లి, కరిమిరెడ్డిపల్లి, రామానంతపురం, ఎస్.కురువపల్లె రెవెన్యూ గ్రామాలను చేర్చారు. ‘పుడా’పరిధిలోకి మరో 9.258 చదరపు కిలోమీటర్లు చేరడంతో ప్రస్తుతం ‘పుడా’పరిధి 1417.13 చదరపు కిలోమీటర్లకు చేరింది.

పుడా పరిధి ఇలా...

6	మొత్తం మండలాలు
82	రెవెన్యూ గ్రామాలు
86.54 చ.కిలోమీటర్లు	తొలుత విస్తీర్ణం
1417.33 చ.కిలోమీటర్లు	ప్రస్తుత విస్తీర్ణం

‘పుడా’ పైనే గురి ఎందుకంటే...

- పుట్టపర్తి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో రెండు అంతస్తుల కంటే ఎక్కువ నిర్మాణాలు చేపట్టాలన్నా...ఏడు సెంట్ల కంటే ఎక్కువ స్థలంలో నిర్మాణాలు చేపట్టాలన్నా తప్పనిసరిగా ‘పుడా’ అనుమతులు తీసుకోవాలి.
- పుట్టపర్తి మాస్టర్ ప్లాన్ రూపకల్పనలోనూ ‘పుడా’ కీలక పాత్రపోషిస్తుంది. అందువల్లే ప్రతి ప్రభుత్వ కార్యక్రమంలోనూ ‘పుడా’ చైర్మన్‌కు తగిన ప్రాధాన్యం ఉంటుంది.
- ఇక గత టీడీపీ హయాంలో ‘పుడా’ను అడ్డుపెట్టుకుని ఆ పార్టీ నేతలు సాగించిన దందా అంతా ఇంతా కాదు. అందుకే ఇప్పుడు మళ్లీ ‘పుడా’ పీఠం కోసం చాలా మంది తమ్ముళ్లు పోటీ పడుతున్నారు. వీరి బాటలోనే మాజీ మంత్రి కూడా ఉన్నట్లు తెలిసింది.

రైతుల పేరుతో రెడ్డెప్పశెట్టి డ్రామా!

- చిత్రావతిపై అక్రమంగా వంతెన కట్టి రైతులను వంచించిన రియల్టర్
- ఇప్పుడు రైతుల కోసమే వంతెన కట్టానంటూ తప్పించుకునే ప్రయత్నం
- ఫిబ్రవరి 28లోపే బ్రిడ్జి తొలగిస్తామని నోటీసులిచ్చి, ఊరుకున్న అధికారులు
- కంచె తొలగింపులోనూ అలసత్వం
- గ్రీన్‌ట్రిబ్యునల్, ఈడీకి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైన రైతులు



రెడ్డెప్పశెట్టి చిత్రావతి నదిపై చిలమత్తూరు మండల పరిధిలో అక్రమంగా నిర్మించిన వంతెన (ఫైల్)

సాక్షి టాస్క్‌ఫోర్స్: చిత్రావతి నదిపై అక్రమంగా వంతెన నిర్మించి ఏళ్లుగా నదీ జలాలను సొంతానికి వాడుకుంటూ రైతుల నోట్లో మట్టికొట్టిన రియల్టర్ రెడ్డప్పశెట్టి...ఇప్పుడు తప్పించుకునేందుకు కొత్త రాగం అందుకున్నారు. చిత్రావతిపై వంతెన రైతుల కోసమేనంటూ సరికొత్త డ్రామాకు తెరతీశారు. అటు అధికారులను, ఇటు కోర్టులను కూడా తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. తన ఎస్టేట్ కోసం చిత్రావతి నదిపై నిర్మించుకున్న అక్రమ వంతెన తొలగిస్తే రైతులకు ఇబ్బంది అంటూ సంబంధం లేని వ్యక్తులతో గోప్యంగా కలెక్టర్‌కు వినతిపత్రం అందించినట్లు తెలుస్తోంది. కంచె వేసుకొని రైతులకు దారి కూడా ఇవ్వకుండా వేధిస్తున్న రెడ్డెప్పశెట్టి... ఇప్పుడు తప్పించుకునేందుకు రైతుల పేరునే వాడుకుంటున్నాడు. తనకు అనుకూలంగా ఉండే కొంతమందిని తన స్వార్థ ప్రయోజనాలకు వాడుకోవడంపై ప్రజల నుంచి విమర్శలు వినపడుతున్నాయి.

చర్యలకు అధికారుల వెనకడుగు

రియల్టర్ రెడ్డెప్పశెట్టి అక్రమాలు సాక్ష్యాలతో సహా వెలుగులోకి వచ్చినా...చర్యలు తీసుకోవడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. నదిపై అక్రమంగా వంతెన నిర్మాణం, కంచె వ్యవహారంపై ‘సాక్షి’ వరుస కథనాలు ప్రచురించగా.. అధికారులు హడావుడి చేశారు. రెడ్డెప్పశెట్టికి నోటీసులిచ్చి, కేసు పెట్టి వదిలేశారు. ఫిబ్రవరి 28వ తేదీలోపే అక్రమ వంతెనను కూల్చేస్తామని నోటీసుల్లో పేర్కొన్నా... నేటికీ చర్యలు తీసుకోలేదు. ఇక ఈడీ అటాచ్‌మెంట్‌లో ఉన్న లేపాక్షి నాలెడ్జ్ హబ్ భూములనూ విడిపించలేదు. నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న అసైన్డ్ భూములనూ వెనక్కి తీసుకునే ప్రయత్నమేదీ చెయ్యలేదు. ఇది అధికారుల్లో నెలకొన్న అలసత్వమా.. లేక మరేదైనా కారణమా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

తప్పించుకునేందుకు సమయం ఇస్తున్నారా?

రెడ్డెప్పశెట్టిపై రెండు కేసులు నమోదు కాగా, పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకునేందుకు తొలుత ప్రయత్నాలు చేశారు. అయితే ఆయన ఎక్కడ ఉన్నాడన్నది తెలియకపోవడంతో ఆ ప్రయత్నాలు విరమించారు. సదరు రియల్టర్‌కు బెయిల్ కూడా రాకపోవడంతో ఆయన అజ్ఞాతంలోనే ఉండిపోయారు. ఇక తామే చర్యలు తీసుకుంటామని చెప్పిన ఇరిగేషన్ అధికారులు నేటికీ ఆ దిశగా అడుగులు వెయ్యకపోవడంతో ఉన్నతాధికారుల ఒత్తిళ్లు ఏమైనా ఉన్నాయా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. 43 ఎకరాలు నది, ప్రభుత్వ భూమికి ఎంజాయ్‌మెంట్ పట్టా పొందడం, దాన్ని ఆక్రమించడం వంటి వాటికి సంబంధించి న్యాయ పరంగా తప్పించుకునేందుకే అధికారులు సమయం ఇస్తున్నారన్న విమర్శలు వినపడుతున్నాయి.

గ్రీన్ ట్రిబ్యునల్, ఈడీలకు ఫిర్యాదు?

రెడ్డెప్పశెట్టి తన పలుకుబడి వినియోగించి అక్రమాలను దాచేసి కోర్టులను తప్పుదోవ పట్టిస్తున్న నేపథ్యంలో కొంతమంది రైతులు గ్రీన్ ట్రిబ్యునల్‌లో ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. నదీ జలాలను ఏళ్లుగా తన సొంత అవసరాలకు వినియోగించుకుంటూ, తన బోరుబావుల్లో నీరు వచ్చేలా ప్లాన్ చేసుకోవడం వంటి వాటితో నదీ పరివాహక రైతులు నీటి సమస్యతో ఇబ్బంది పడ్డారు. ఇప్పుడు కూడా తప్పించుకునే ప్రయత్నం చేస్తుండటంతో ఇక నేరుగా గ్రీన్ ట్రిబ్యునల్‌లో ఫిర్యాదు చేసేందుకు రైతులు సిద్ధమైనట్లు సమాచారం. అదే విధంగా ఈడీ అటాచ్‌మెంట్‌లోని భూములను ఆక్రమించిన నేపథ్యంలో ఈడీ కార్యాలయంలోనూ ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

తొలి సంతకం ఏమైంది బాబూ?

- డీఎస్సీ అభ్యర్థులను వంచిస్తోన్న చంద్రబాబు
- వేతనాలు పెంచుతామని వలంటీర్లకు మోసం
- నిరుద్యోగ సమస్యపై సత్వరమే ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ డిమాండ్



విలేకరులతో మాట్లాడుతున్న ఉషశ్రీచరణ్

పరిగి: ‘‘ఎన్నికల వేళ బాబు వస్తే జాబు వస్తుందని గొప్పలు చెప్పారు. అధికారంలోకి రాగానే ఉన్న ఉద్యోగాలు పీకేశారు. తొలి సంతకం డీఎస్సీ నోటిఫికేషన్‌పైనే అంటూ ఆర్భాటంగా ప్రకటించారు..అధికారం చేపట్టి 9 నెలలు దాటినా ఇంతవరకూ నోటిఫికేషన్ లేదు. ఏటా జాబ్ క్యాలెండర్..అంటూ అరచేతిలో వైకుంఠం చూపారు. నేటికీ ఒక్క ఉద్యోగం కూడా భర్తీ చేయకుండా మోసం చేశారు’’ అంటూ మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ మండిపడ్డారు. మంగళవారం ఆమె.. మండలంలోని శీగిపల్లిలో విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన రోజే తొలి సంతకంగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి, ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని చంద్రబాబు హామీ ఇవ్వడంతో... నిరుద్యోగులు గంపెడాశలతో నాటి నుంచి ఎదురుచూస్తునే ఉన్నారన్నారు. పైగా కోచింగ్‌ల కోసం లక్షలాది రూపాయలను వెచ్చించి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం అదిగో డీఎస్సీ...ఇదిగో నోటిఫికేషన్ అంటూ కాలయాపన చేయడం మాని వెంటనే రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం

రాష్ట్రంలో డిగ్రీలు, పీజీలతో పాటూ ఇతరత్రా టెక్నికల్ కోర్సులు చేసిన లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకుండా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం బాధ్యతారాహిత్యమని ఉషశ్రీచరణ్ మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి దాదాపుగా నాలుగు లక్షల ఉద్యోగాలను కల్పించారన్నారు. అదేవిధంగా వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు.

వలంటీర్లకు తీరని అన్యాయం

వలంటీర్ల ద్వారా గత ప్రభుత్వం ప్రతి గ్రామ గ్రామానా సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేసిందని ఉషశ్రీచరణ్ తెలిపారు. కోవిడ్ వంటి విపత్కర సమయంలో వలంటీర్ల సేవలతో యావత్ ప్రపంచమే జేజేలు పలికిందన్నారు. తాము అధికారంలోకి వస్తే వలంటీర్లకు ఇస్తున్న వేతనాన్ని రూ.10 వేలకు పెంచుతామని ఎన్నికల వేళ హామీ ఇచ్చిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చాక..ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేకపోగా..ఉన్న వ్యవస్థను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. తమకు జరిగిన అన్యాయంపై గత కొన్ని రోజులుగా వలంటీర్లు ధర్నాలు, రాస్తారోకోలు, ఉద్యమాలు చేపడుతున్నప్పటికీ ప్రభుత్వంలో చలనం రాకపోవడం దురదృష్టకరమన్నారు. నిరుద్యోగుల సమస్యలతో పాటు ఉద్యోగాల నోటిఫికేషన్లను వెంటనే విడుదల చేసి ఆదుకోకపోతే వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఉద్యమాలకు శ్రీకారం చుడతామని ఉషశ్రీ చరణ్ హెచ్చరించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, సర్పంచ్ లక్ష్మణ్ణ తదితరులు పాల్గొన్నారు.



గరుడ వాహనంపై కొలువుదీరిన లక్ష్మీ నారసింహుడు

గరుడ వాహనంపై ఖాద్రీశుడు

కదిరి: కాటమరాయుడి బ్రహ్మోత్సవాలు కమనీయంగా సాగుతున్నాయి. పదో రోజైన మంగళవారం రాత్రి ఖాద్రీశుడు మరోసారి గరుడా రూఢుడై తిరువీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. మోహినీ ఉత్సవంలో ముందు రోజు తిరువీధుల్లో ఊరేగిన శ్రీవారు సాయంత్రానికి తిరిగి ఆలయం చేరుకున్నారు. నిత్యపూజలు, గ్రామోత్సవం అనంతరం రాత్రి సమయంలో గరుడ వాహనంపై ఆలయ ప్రాంగణంలో కొలువుదీరారు. విశేషాలంకరణ ముగిసిన వెంటనే స్వామి వారికి ప్రధాన అర్చకులు దివ్య మంగళ హారతినిచ్చారు. అప్పటికే రాజగోపురం వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకున్న భక్తులు తమ ఇలవేల్పును దర్శించుకుని తరించారు. తర్వాత స్వామి వారు తిరువీధుల్లో విహరించారు. ఉత్సవాలకు అధిపతి అయిన బ్రహ్మ ప్రజల కోరిక మేరకు తన ఇష్ట వాహనమైన గరుత్మంతుడిని నారసింహునికి వాహనంగా పంపుతారు. దీన్నే ప్రజా గరుడసేవ..మలి గరుడసేవ అని కూడా అంటారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

గిరి ప్రదక్షిణ

గతంలో ఎన్నడూ లేని విధంగా మంగళవారం లక్ష్మీ నారసింహుని జన్మనక్షత్రాన్ని పురస్కరించుకొని పట్టణానికి చెందిన భక్తులు ఉదయాన్నే కదిరి కొండకు చేరుకొని గిరి ప్రదక్షిణ చేశారు. కాగా, బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి బుధవారం రాత్రి తెల్లటి ఐరావతంపై తిరువీధుల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు.



ఖాద్రీశుని దర్శనం కోసం ఆలయంలో పోటెత్తిన భక్తజనం

EAMCET TARGET 120+ Marks
NEET TARGET 600+ Marks
JEE TARGET 160+ Marks
తేజ 9948567527, 9490859421

SRI MASTERS ACADEMY
CLASSES STARTS 24-03-2025
9440774498, 9440445898
45 DAILY TESTS & 8 GRAND TESTS
EAPCET NEET JEE (MAINS)
SEPARATE HOSTEL FOR BOYS & GIRLS

EAPCET 2nd BATCH STARTS 20th MARCH
NEET JEE-IIT
AC CAMPUS | ONLY GIRLS
GLOBAL SCHOOL COLLEGE
9247134363, 8555826272

క్లుప్తంగా

పీటీ వారెంట్‌పై నిందితుల అరెస్ట్

పెనుకొండ: ముగ్గురు పేరుమోసిన నిందితులను పీటీ వారెంట్‌పై పెనుకొండ పోలీసులు అరెస్ట్ చేసి పెనుకొండ కోర్టులో మంగళవారం హాజరుపరిచారు. ఈ మేరకు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఇటీవల అనంతపురం జిల్లాలో రూ.3.5 కోట్ల మేర బంగారు, నగదు చోరీ చేసిన ఘటనకు సంబంధించి నిందితులు నూర్, సావన్, సునీల్ చౌహాన్‌ను ఆ జిల్లా పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. దోపిడీ సమయంలో వారు ఉపయోగించిన ద్విచక్ర వాహనం పెనుకొండలో చోరీ చేసినట్లుగా నిర్ధారణ అయింది. అయితే ఇప్పటికే ద్విచక్ర వాహనం చోరీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు... నిందితులను పీటీ వారెంట్‌పై అరెస్ట్ చేసి అనంతపురం సబ్ జైలు నుంచి తీసుకువచ్చి మంగళవారం పెనుకొండ కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు నిందితులను రిమాండ్‌కు తరలించారు.

చైన్ స్నాచింగ్‌కు విఫలయత్నం

హిందూపురం అర్బన్: స్థానిక శ్రీనివాస థియేటర్ సమీపంలో నివాసముంటున్న కరణం నిర్మలమ్మ మెడలోని బంగారు గొలుసును లాక్కొని వెళ్లేందుకు దుండగుడు విఫలయత్నం చేశారు. వివరాలు... మంగళవారం ఉదయం 7 గంటల సమయంలో తన ఇంటి ఎదుట నిర్మలమ్మ పనిచేసుకుంటుండగా ద్విచక్ర వాహనంపై వచ్చిన ఓ యువకుడు ఆమె మెడలోని బంగారం మాంగల్యం చైన్‌ను లాగేందుకు ప్రయత్నించాడు. ఆ సమయంలో అప్రమత్తమైన ఆమె చైన్‌ను గట్టిగా పట్టుకుని కేకలు వేయడంతో దుండగుడు ద్విచక్ర వాహనంపై ఉడాయించాడు. అప్పటికే మెడ నుంచి మూడు తులాల మంగళ్యం చైన్ తెగి కింద పడింది. దుండగుడి ఆచూకీ కోసం చుట్టుపక్కల వారు గాలించినా ఫలితం లేకపోయింది.

20 నుంచి 'ఏపీ సూపర్ కప్'

అనంతపురం: ఏపీలో తొలిసారిగా మరో క్రీడా పండుగకు అనంత ముస్తాబైంది. ఏపీఎల్ క్రికెట్ తరహాలోనే ఫుట్‌బాల్‌లో ఏపీ సూపర్ కప్ ట్రోఫీని అనంత క్రీడాగ్రామంలోని ఆర్డీటీ ఫుట్‌బాల్ స్టేడియంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు. ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి 27వ తేదీ వరకు జరిగే ఈ టోర్నీ షెడ్యూల్‌ను ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోటగిరి శ్రీధర్ మంగళవారం వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా 8 జోన్లుగా విభజించి 8 ఫుట్‌బాల్ క్లబ్బులు ఏర్పాటు చేశామన్నారు. వంశధార ఫుట్‌బాల్ క్లబ్ (శ్రీకాకుళం, విజయనగరం, మన్యం జిల్లాలు), విశాఖపట్నం ఫుట్‌బాల్ క్లబ్ (విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామ రాజు జిల్లాలు), గోదావరి ఫుట్‌బాల్ క్లబ్ (తూర్పు గోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాలు), కొల్లేరు ఫుట్‌బాల్ క్లబ్ (ఏలూరు, తూర్పు గోదావరి, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలు), నల్లమల ఫుట్‌బాల్ క్లబ్ (గుంటూరు, ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాలు), కోరమాండల్ ఫుట్‌బాల్ క్లబ్ (నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాలు), పెన్నా ఫుట్‌బాల్ క్లబ్ (కడప, శ్రీసత్యసాయి, అన్నమయ్య జిల్లాలు), తుంగభద్ర క్రికెట్ క్లబ్ (అనంతపురం, కర్నూలు, నంద్యాల జిల్లాలు) లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఒక్కో క్లబ్ నుంచి ఆయా స్థానిక జిల్లాలకు చెందిన 11 మంది ఫుట్‌బాల్ క్రీడాకారులతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన మరో 11 మందికి చోటు కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 27వ తేదీ ఫైనల్ మ్యాచ్ అనంతరం విజేత జట్టుకు రూ.5 లక్షల బహుమతితో పాటు ట్రోఫీని అందజేస్తామన్నారు.

డిజిటల్ అరెస్ట్ పేరుతో దోపిడీ

- రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు



హిందూపురం అర్బన్: 'డిజిటల్ అరెస్ట్' పేరుతో అమాయకుల్ని సైబర్ నేరగాళ్లు మోసం చేస్తూ రూ.లక్షల్లో దోచేస్తున్న ఘటనలు ఇటీవల జిల్లాలో ఎక్కువయ్యాయి. గత మూడు నెలల వ్యవధిలోనే పలువురికి డిజిటల్ అరెస్ట్ పేరుతో ఫోన్ కాల్స్ వచ్చాయి. వీటిని నమ్మిన పలువురు అవతలి వ్యక్తుల డిమాండ్ మేరకు డబ్బు చెల్లించి, ఆ తర్వాత తాము మోసపోయినట్లుగా నిర్ధారించుకుని లబోదిబోమన్నారు.

మచ్చుకు కొన్ని

- ''హలో.. మీ కుమారుడి సెల్ ఫోన్ నుంచి అసభ్యకర వాయిస్‌లు, మెసేజ్‌లు వెళ్లాయని ఓ యువతి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశాం'' అంటూ హిందూపురానికి చెందిన ఓ వ్యాపారికి బెంగళూరు నుంచి కర్ణాటక పోలీసు డ్రస్‌లో ఉన్న ఓ వ్యక్తి వీడియో కాల్ చేసి మాట్లాడాడు. కుమారుడిని అరెస్ట్ చేస్తున్నట్లు పేర్కొన్నాడు. దీంతో బెంబేలెత్తిన సదరు వ్యాపారి తన కుమారుడితో మాట్లాడేందుకు పలుమార్లు ఫోన్ చేసినా ఫలితం లేకపోయింది. వెంటనే తన స్నేహితులతో కలసి బెంగళూరుకు వెళ్లి తన కుమారుడు చదువుకుంటున్న కళాశాల హాస్టల్ గదికి వెళ్లి ఆరా తీశాడు. అక్కడ కుమారుడు ఉండడం చూసిన ఆయనలో టెన్షన్ తగ్గింది. విషయం తెలుసుకున్న కుమారుడు తాను ఎవరికీ ఫోన్ కాల్ చేయలేదని తెలపడంతో విషయాన్ని సిటీ క్రైమ్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లాడు. విచారణలో ఇది సైబర్ నేరగాళ్ల పనిగా నిర్ధారణ అయింది.
- హిందూపురం పట్టణానికి చెందిన ఓ విశ్రాంత ఉద్యోగికి ఇటీవల ఓ ఫోన్ కాల్ వచ్చింది. 'మీ పేరున ముంబయికి పార్శిల్ వచ్చింది. అందులో మాదకద్రవ్యాలు ఉన్నాయి. దీంతో మీపై కేసు నమోదు చేశాం' అంటూ బెదిరింపులకు దిగారు. తాను అలాంటి వ్యక్తిని కాదని విశ్రాంత ఉద్యోగి చెపుతుండగానే అవతలి వ్యక్తి గద్దిస్తూ ఆధార్ నంబర్‌తో సహా తెలపడంతో ఇవతలి వ్యక్తి భయపడిపోయాడు. కేసు లేకుండా చేయాలంటే రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఇలా ఫిబ్రవరిలో వారం రోజుల పాటు అతని బ్యాంక్ ఖాతా నుంచి వివిధ ఖాతాలకు రూ.3 లక్షల వరకు జమ చేయించుకున్నారు. అంతటితో ఆగక మళ్లీ డిమాండ్ చేయడంతో తాను మోసపోయినట్లు గ్రహించిన విశ్రాంత ఉద్యోగి తొలుత పోలీసులకు ఫిర్యాదు చేయాలని భావించారు. అయితే తన పరువుకు భంగం కలుగుతుందని భావించిన ఆయన చివరకు మిన్నకుండిపోయాడు. ఆ తర్వాత కూడా పలుమార్లు సైబర్ నేరగాళ్ల నుంచి ఫోన్ కాల్స్ వచ్చినా ఆయన స్పందించలేదు.
- ముద్దిరెడ్డిపల్లికి చెందిన పట్టు చీరల వ్యాపారం చేసే మహిళలకు ఇన్‌స్టాగామ్‌లో ఆన్‌లైన్ ట్రేడింగ్‌పై లింక్ వచ్చింది. ఆమె దానిని ఓపన్ చేసి అందులో వారు పేర్కొన్న విధంగా కొంత మొత్తాన్ని వారి ఖాతాకు బదిలీ చేసింది. ఆ తర్వాత కాసేపటికి అవతలి వ్యక్తుల నుంచి కొంత మొత్తం కలిపి మళ్లీ ఆమె ఖాతాకు జమ అయింది. ఇలా పలుదఫాలుగా కొనసాగిన అనంతరం ఒకేసారి పెద్ద మొత్తం వేస్తే అంతకు రెట్టింపు సొమ్ము వస్తుందని అవతలి వ్యక్తి నమ్మబలకడంతో ఏకంగా రూ.2 లక్షలను బదిలీ చేసింది. ఆ తర్వాత అవతలి వ్యక్తి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. దీంతో తాను మోసపోయినట్లు గ్రహించిన ఆమె కుటుంబ పరువు పోతుందని బయటకు చెప్పుకోలేక మిన్నకుండి పోయింది.

వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దు



గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌కు స్పందించరాదు. వారికి వ్యక్తిగత సమాచారం ఇవ్వరాదు. నిజమైన పోలీసులు కానీ, కేంద్ర ప్రభుత్వ సంస్థల అధికారులు కాని నగదు బదిలీ చేయమని అడగరు. ఇలా అడిగారంటే వారు ఖచ్చితంగా సైబర్ నేరగాళ్లేనని గుర్తించాలి. అనుమానం వస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. లేదంటే సైబర్ నియంత్రణ టోల్‌ఫ్రీ నెంబర్ 1930కు సమాచారం అందించాలి.

– కె.వి.మహేష్, డీఎస్పీ, హిందూపురం

కష్టార్జితాన్ని కాజేస్తూ...

రోజుకొక సరికొత్త ఎత్తు గడలతో దోచుకొనే సైబర్ నేరగాళ్ల వలలో ఇప్పటికే పలువురు చిక్కుకుని రూ.లక్షల్లో నష్టపోయారు. తాజాగా డిజిటల్ అరెస్ట్ పేరుతో బెదిరిస్తూ అందినకాడికి ప్రజల కష్టార్జితాన్ని లూటీ చేసేస్తుండడంతో జిల్లా వాసులు బెంబేలెత్తిపోతున్నారు. ఇలాంటి మోసాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

పెనుకొండ: స్థానిక నగర పంచాయతీ పరిధిలోని ఇస్లాపురం గ్రామ సమీపంలో చోటు చేసుకున్న విశ్రాంత ఉపాధ్యాయుడి హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను మంగళవారం సీఐ రాఘవన్ వెల్లడించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు ఆంజనేయులు అదే గ్రామానికి చెందిన తిప్పమ్మతో కొన్నేళ్లుగా సహజీవనం సాగిస్తున్నాడు. ఉద్యోగ విరమణ అనంతరంరామె వద్దనే ఉంటూ వచ్చాడు. ఈ నేపథ్యంలో వ్యక్తిగత కారణాలతో మూడు నెలల క్రితం ఆయనను తిప్పమ్మ కుమారుడు నాగరాజు హత మార్చి అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. తొలుత సాధారణ మృతిగా భావించినా... అంజనేయులు సోదరులు అనుమానాలు వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయడంతో ఆ దిశగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో ఆంజనేయులుది సాధారణ మరణం కాదని, హత్యగా నిర్ధారణ కావడంతో పక్కా ఆధారాలతో మంగళవారం నాగరాజును అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

చెట్టుపై నుంచి పడి వృద్ధుడి మృతి



చంద్రప్ప (ఫైల్)

అగళి: ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి కింద పడి ఓ వృద్ధుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... అగళి మండలం పూజారిపల్లికి చెందిన చంద్రప్ప (72) కూలి పనులతో జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు ఇద్దరు భార్యలు కాగా, మొదటి భార్య శివలింగమ్మకు సంతానం లేకపోవడంతో అంజనమ్మను రెండవ పెళ్లి చేసుకున్నాడు. ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. పి.బ్యాడగెర గ్రామానికి చెందిన రైతు సత్యప్ప పొలంలో చింత ఫలసాయాన్ని కొనుగోలు చేసిన గుడిబండ మండలానికి చెందిన రామకృష్ణప్ప సోమవారం పలువురు కూలీలను పనిలో పెట్టాడు. ఈ క్రమంలో చెట్టుపైకి ఎక్కి చింత కాయలు దులుపుతున్న చంద్రప్ప ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన ఆయనను తోటి కూలీలు వెంటనే మడకశిరలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక అదే రోజు రాత్రి ఆయన మృతి చెందాడు. మృతుడి కుమారుడు మారుతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

రాచువారిపల్లిలో చోరీ

తనకల్లు: మండలంలోని రాచువారిపల్లిలో నివాసముంటున్న దేశాయి భక్తవత్సలరెడ్డి ఇంట్లో మంగళవారం చోరీ జరిగింది. ఇంటికి తాళం వేసి తన కుటుంబసభ్యులతో కలసి పది రోజుల క్రితం ఆయన కాశీకి వెళ్లారు. తాళం వేసిన ఇంటిని గమనించిన దుండగులు మంగళవారం పట్టపగలే ఇంటి వెనుక ఉన్న తలుపు తెరిచి లోపలికి ప్రవేశించారు. మూడు బెడ్‌రూములలో ఉన్న బీరువాలను ధ్వంసం చేసి అందులోని పట్టు చీరలు, ఇతర విలువైన సామగ్రిని అపహరించారు. భక్తవత్సలరెడ్డి సమీప బంధువు సమాచారంతో ఎస్‌ఐ గోపి అక్కడకు చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీంను రంగంలో దింపి నిందితుల వేలి ముద్రలను సేకరించారు. కాగా, ఇంటి యజమాని వచ్చిన తర్వాత ఏఏ వస్తువులు చోరీకి గురయ్యాయో తెలుసుకుని కేసు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

తరగతి గదిలో విద్యార్థికి తేలు కాటు



పెనుకొండ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి

పెనుకొండ రూరల్: తరగతి గదిలో పాఠాలు వింటున్న ఓ విద్యార్థిని తేలు కుట్టింది. దీంతో తీవ్ర అస్వస్థతకు గురైన బాలుడిని మెరుగైన వైద్యం కోసం అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు. వివరాల్లోకి వెళితే...మండల పరిధిలోని శెట్టిపల్లి గ్రామానికి చెందిన మహికాంత్ రెడ్డి స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 3వ తరగతి చదువుకుంటున్నాడు. మంగళవారం ఉదయం ఎప్పటిలాగే పాఠశాలకు వెళ్లాడు. ఉదయం తరగతి గదిలో పాఠాలు వింటుండగా ఏదో కుట్టినట్లు విపరీతమైన నొప్పి వచ్చింది. వెంటనే ఉపాధ్యాయులకు చూపించగా... తేలు మూడుచోట్ల కుట్టినట్లు గుర్తించి వెంటనే తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో పాటు పెనుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు.

ఉచిత ఇసుక అందుబాటులో ఉంచాలి

- అధికారులకు కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశం



ఉచిత ఇసుక అమలుపై సమీక్షిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: వినియోగదారులందరికీ ఉచిత ఇసుక అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులను కలెక్టర్ చేతన్ ఆదేశించారు. జిల్లాలో ఉచిత ఇసుక అమలుపై మంగళవారం స్థానిక మినీ కాన్ఫరెన్స్ హాలులో అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. నాణ్యమైన ఇసుక సరఫరా చేయాల్సిన బాధ్యత మైనింగ్ శాఖ అధికారులదేనన్నారు. నదీ ప్రవాహాలకు అనుకుని ఉన్న గ్రామాల పరిధిలో వినియోగదారులే ఇసుకను ఉచితంగా తీసుకెళ్లవచ్చన్నారు. ఆర్డీఓలు ఇసుక డంపింగ్ యార్డులను తనిఖీ చేయడంతో పాటు ప్రతి 15 రోజులకోసారి ఉచిత ఇసుక అమలుపై సమీక్షా సమావేశాలు నిర్వహించాలన్నారు. అన్ని ఇసుక డంపింగ్ యార్డుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. రిజిస్ట్రేషన్ బ్యానర్, జీపీఎస్ లేకుండా ఇసుకను రవాణా చేస్తే ఆ వాహనాన్ని బ్లాక్ లిస్ట్‌లో ఉంచాలన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై సమాచారం ఇవ్వండి

జిల్లాల్లో ఎక్కడైనా ఇసుక అక్రమ రవాణా జరుగుతుంటే 100 లేదా 112 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం చెప్పవచ్చని, తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ వి.రత్న తెలిపారు. జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా, నిల్వ, బ్లాక్ మార్కెటింగ్‌పై రోజువారీగా కేసులు నమోదు చేస్తున్నామన్నారు. సమావేశంలో జేసీ అభిషేక్ కుమార్, జిల్లా గనులు శాఖ అధికారి పెద్దిరెడ్డి, ధర్మవరం ఆర్డీఓ మహేష్, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

తప్పుడు సమాచారంతో ఆధార్ నమోదు చేయొద్దు

ఆధార్ నమోదు, అప్డేషన్లలో తప్పులు దొర్లకూడదని, ఎవరైనా తప్పుడు సమాచారంతో ఆధార్ నమోదు చేస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ టీఎస్ చేతన్ హెచ్చరించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో జిల్లా కమిటీతో సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ఆధార్ సెంటర్లను తనిఖీ చేసి నిర్లక్ష్యంగా ఉన్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో ఆధార్ నమోదు స్పెషల్ క్యాంపులు నిర్వహించాలన్నారు.

స్వర్ణాంధ్రకు పది సూత్రాలు అమలు చేయాలి

స్వర్ణాంధ్ర విజన్-2047 సాకారానికి పది సూత్రాలు, ప్రభుత్వ మార్గదర్శకాలు కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని కోర్టు హాలులో అధికారులతో సమావేశం నిర్వహించారు. త్వరలో విజయవాడలో జిల్లా కలెక్టర్ల సదస్సు నిర్వహించనున్న నేపథ్యంలో జిల్లాలోని వివిధ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలపై సమీక్షించారు. వ్యవసాయ, అనుబంధ రంగాల ద్వారా ఆదాయాలు పెంచుకునే మార్గాలపై ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో చేపట్టిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. బీసీ సంక్షేమ శాఖ అధికారులు బాధ్యతగా పనిచేయాలన్నారు. నల్లచెరువు మండలంలో ఏర్పాటు చేయనున్న ఉద్యాన ప్రాసెసింగ్ యూనిట్‌పై సమీక్షించారు.


నాటి ఖాద్రి.. నేటి కదిరి



నాలుగు గోపురాల నడుమ వెలసిన ఆలయం



సువాసనలు వెదజల్లే కదిరి కుంకుమ



కదిరి: పూర్వం ఖాద్రిగా పిలుచుకునే ప్రాంతమే నేడు కదిరిగా మారింది. సంస్కృతంలో 'ఖా' అంటే విష్ణు పాదం అని అర్థం. అద్రి అంటే కొండ. ఈ రెండింటినీ కలిపి ఖాద్రి (విష్ణువు పాదం మోపిన కొండ)గా అప్పట్లో పిలిచేవారు. కాలక్రమేణా... ఖాద్రి కాస్త కదిరిగా మారిపోయింది. దేశంలోని అత్యధికంగా ప్రతిష్టిత ఆలయాలు ఉండగా.. మరికొన్ని స్వయంభువుగా వెలసినవి ఉన్నాయి. ఇందులో ఖాద్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం కూడా ఒకటి. ఆలయ చరిత్రను పరిశీలిస్తే.. పూర్వం హిరణ్యకశ్యపుడి సంహారం అనంతరం ఖాద్రీ ప్రాంతంలో సంచరిస్తున్న నారసింహుడి ఉగ్రరూపాన్ని శాంతింప చేయడానికి దేవతల అభ్యర్థన మేరకు ప్రహ్లాదుడు స్తుతిస్తాడు. దీంతో సంతుష్టుడైన నారసింహుడు ప్రహ్లాదుడిని దగ్గరకు తీసుకుని ఆశీర్వదిస్తాడు. ఈ ఘట్టాన్ని ఆవిష్కరిస్తున్నట్లుగా కదిరి ఆలయంలో ప్రహ్లాద సమేతంగా నారసింహుడు భక్తులకు దర్శనమిస్తున్నారు. క్రీ.శ. 10వ శతాబ్దంలో పట్నం పాలేగారు రంగనాయకులుకు స్వామి స్వప్నంలో కనిపించి ఆదేశించిన మేరకు ఖాద్రి వృక్షం కింద తవ్వకాలు చేపడతాడు. ఆ సమయంలో బయటపడిన ప్రహ్లాద సమేత నారసింహుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఆలయ నిర్మాణం పూర్తి చేశారు. నాలుగు దివ్యమైన గోపుర శిఖరాల నడుమ వెలసిన ఈ ఆలయంలో స్వామి వారిని దర్శించుకుంటే సాక్షాతూ ఆ బదరీనారాయణుడిని దర్శించుకున్నంత పుణ్యఫలం దక్కుతుందని భక్తుల విశ్వాసం. తూర్పు రాజగోపురాన్ని హరిహర రాయలు, పడమర గోపురాన్ని క్రీ.శ 1469లో స్వామి భక్తురాలు సాసవుల చిన్నమ్మ, దక్షిణ గోపురాన్ని క్రీ. శ 1386లో కొక్కంటి పాలేగారు వీరమల్లప్ప నాయుడు కుటుంబీకులు, ఉత్తర రాజ గోపురాన్ని ముస్లిం పాలకులు నిర్మించినట్లు తెలుస్తోంది. బ్రహ్మోత్సవాల్లో స్వామివారిని రోజూ కదిరి మల్లెలతోనే అలంకరిస్తారు. ఇక్కడి దవణానికి కూడా చాలా ప్రత్యేకత ఉంది. బ్రహ్మోత్సవాలకు విచ్చేసిన భక్తులు తమవెంట కదిరి మల్లెలు, కుంకుమ, దవణం విధిగా తీసుకెళ్తారు.

సీఎస్‌డీటీలు బాధ్యతగా పని చేయాలి : జేసీ

ప్రశాంత నిలయం: ప్రజా పంపిణీ వ్యవస్థ నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేలా బాధ్యతాయుతంగా పనిచేయాలని సీఎస్‌డీటీలకు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ సూచించారు. జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థపై కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సీఎస్‌డీటీలతో మంగళవారం ఆయన సమీక్షించారు. బియ్యం అక్రమ రవాణా అరికట్టాలన్నారు. పేదలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న చౌక బియ్యం తూకాల్లో మోసాలు జరగకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలన్నారు. ఎండీయూ వాహనాలను, గ్యాస్ ఏజెన్సీలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ వాటి సేవలపై ప్రజల అభిప్రాయాలు సేకరించాలన్నారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీలు రమేష్, సింధూ, జిల్లాలోని పలు గ్యాస్‌ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

బాడీ బిల్డింగ్ పోటీలో కదిరి వాసి ప్రతిభ



ట్రోఫీ అందుకుంటున్న రమేష్

కదిరి టౌన్: మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ పోటీలో కదిరికి చెందిన రమేష్‌కు రెండు ట్రోఫీలు దక్కాయి. ఆదివారం సూళ్లూరుపేటలో మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. మాస్టర్ కేటగిరి కింద 75 కిలోల విభాగంలో రమేష్ తృతీయ స్థానాన్ని దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా ఆయనకు ప్రశంసాపత్రంతో పాటు రెండు ట్రోఫీలను నిర్వాహకులు అందజేసి, సత్కరించారు.

టీడీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారులు

- వాహనాల పార్కింగ్‌కు సంబంధించి రూ.72 లక్షల వేలం రద్దు చేసిన వైనం
- తెలుగు తమ్ముళ్ల హైడ్రామాలకు వేదికగా మారిన పంచాయతీ కార్యాలయం



బాధితుడు శంకరరెడ్డిని చుట్టుముట్టి మాట్లాడుతున్న అధికారులు, టీడీపీ నేతలు

లేపాక్షి: లక్షలాది రూపాయలతో వేలం పాట దక్కించుకున్నా అధికారులు డబ్బులు కట్టించుకోకుండా టీడీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గారు. ఎమ్మెల్యే కార్యాలయ పైరవీలతో చివరకు వేలాన్ని రద్దు చేసారు. వివరాలు... లేపాక్షి గ్రామ పంచాయతీ పరిధిలో వారపు సంత, బస్టాండు ఆదాయ వనరులపై పంచాయతీ అధికారులు సోమవారం ఉదయం వేలం పాట నిర్వహించారు. ఇందులో బస్టాండులో వాహనాల పార్కింగ్‌కు సంబంధించి లేపాక్షికి చెందిన శంకరరెడ్డి అత్యధికంగా రూ.72 లక్షల వేలం పాడి దక్కించుకున్నారు. నిబంధనల మేరకు వేలం పాడిన 24 గంటల్లోపు వేలం పాడిన మొత్తంలో 50 శాతం డిపాజిట్ చెల్లించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం 12 గంటలకే 50 శాతం మొత్తాన్ని వేలం పాటదారుడు చెల్లించడానికి వెళితే అక్కడ అధికారులు అందుబాటులో లేకుండా పోయారు. ఇదేమని ఆరా తీస్తే టీడీపీ నేతల ఒత్తిళ్లతో అధికారులు కార్యాలయం వదిలి వెళ్లిపోయారని తేలింది. అదే సమయంలో సమయం మించి పోయిన తర్వాత డబ్బు చెల్లించేందుకు వచ్చినందుకు తిరస్కరిస్తున్నట్లుగా అక్కడున్న కింది స్థాయి సిబ్బంది నోటీసులు ఇచ్చే ప్రయత్నం చేసారు. ఈ అన్యాయంపై శంకరరెడ్డి అసహనం వ్యక్తం చేస్తుండగానే టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. అధికారంలో ఉన్నాం కాబట్టి తమకు అనుకూలంగా ఉన్న వారికే అధికారులు పనులు చేయాలని, తమ పార్టీకి సంబంధంలోని వ్యక్తికి టెండర్ ఎలా ఇస్తారంటూ దౌర్జన్యానికి దిగారు. దీంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ నరేంద్ర, గ్రామ సర్పంచ్ ఆదినారాయణ అక్కడకు చేరుకుని సర్ది చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. ఈఓఆర్డీ ఆనందకుమార్, పంచాయతీ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ... నిబంధనల మేరకు వేలం పాట రద్దు చేసి తిరిగి ఎప్పుడు వేలం నిర్వహించేది ప్రకటిస్తామని పేర్కొన్నారు. శంకర్‌రెడ్డి మాట్లాడుతూ మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు తాను కార్యాలయానికి చేరుకున్న సమయంలో పంచాయతీ సిబ్బంది తప్ప కార్యదర్శి అందుబాటులో లేరన్నారు. 2 గంటల తర్వాత వచ్చిన కార్యదర్శి, ఈఓఆర్డీ డబ్బులు కట్టించుకోకుండా నిరాకరించారన్నారు. కేవలం టీడీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి తనకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయంపై న్యాయపోరాటానికి సిద్ధమవుతున్నట్లు పేర్కొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

STAR REAL ESTATES
■ అనంతపురం నుంచి కేవలం 7 కి.మీ. లోపలే ATP నుండి ధర్మవరం వెళ్ళే 100 అ॥ రోడ్డు దగ్గరలో సెంటు కేవలం ₹2,49,000 నుండి ప్రారంభం. మరిన్ని వివరాల కోసం సెల్: 9396205666, షేక్షావలి, స్టార్ రియల్ ఎస్టేట్స్, రాంనగర్ రిజిస్టర్ ఆఫీస్ ఎదురుగా, ATP. [A-1541]

SERVICES
■ రుణాలు,వ్యక్తిగత,వ్యవసాయం,వ్యాపారం రుణం తక్కువ వడ్డీరేటు, సిబిల్ అవసరం లేదు, NPAవారు కూడా సలహాల కొరకు సంప్రదించండి. పార్తిబా, 9121625779. [T-314]

WANTED
■ ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ : 20K. Ph: 8977639663, 8977639662 [SCA25002130]

■ SOLAR ప్రొడక్ట్స్ మార్కెటింగ్ కొరకు అనుభవము గల సేల్స్ పర్సన్స్ కావలెను. # ప్రశాంతి నగర్, తపోవనం దగ్గర, అనంతపురం. 9160353879. [SCA25002195]

■ JOBS: కిచెన్ వేర్ ఐటమ్స్, జిల్లా వ్యాప్తంగా మార్కెటింగ్ కొరకు, అనుభవంగల సేల్స్ ఎగ్జిక్యూటివ్ కావలెను. మంచి జీతం + ఇన్సెంటివ్ + TA, DA ఇవ్వబడును. # శ్రీ విష్ణు ఎంటర్‌ప్రైజెస్, ATP. 9000786886, 7207472886. [A-1542]

■ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం: 25,000 నుండి 30,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95504 67459. [SCA 25002218]

■ అనంతపురం పట్టణంలోని ప్రముఖ కళాశాలకు మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, జువాలజీ సబ్జెక్టుల సీనియర్ మరియు జూనియర్ లెక్చరర్లు, లేడీ మరియు జెంట్స్ వార్డెన్లు, కాలేజ్ లోనే ఉండే బాత్రూం కడిగే వాళ్ళు మరియు కసువు ఊడ్చే వాళ్ళు కావలెను. సెల్ : 8019545433, 8019787833, 9652390088. [A-1540]

ప్రకటన గోరంత ! స్పందన కొండంత !!
4 లైన్లు రూ: 270/-
అదనపు లైను రూ: 60/-
ప్రతి 3 ప్రకటనలకు 1 ప్రకటన ఉచితం
ANANTHAPURAMU : 9010567770, 9492288307
DHARMAVARAM & PUTTAPARTHI : 9912220726, 7093150088
HINDUPUR & MADAKASIRA : 9912220723
GUNTAKAL & TADIPATRI : 9912220722
KADIRI : 7093150088
RAYADURG : 9010470185

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా RACPC, ధర్మవరం శ్రీసత్యసాయి జిల్లా

"సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ అఫ్ ఫైనాన్సియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002"లోని సెక్షన్ 13(2) క్రింద జారీచేసిన నోటీసు

కాలమ్ నం. 1లో పేరు తెలిపిన దిగువ వ్యక్తి రుణగ్రహీత, తనఖాపెట్టిన ఆస్తుల వివరాలు కాలమ్ నం.2లో తెలుపబడినవి. పలుమార్లు రిమైండర్లు పంపినప్పటికీ కాలమ్ నం. 3లో చూపిన విధంగా బకాయి మొత్తాలను తిరిగి చెల్లించుటలో రుణగ్రహీత విఫలమైనందున RBI మార్గదర్శకాల ప్రకారం ఈ బకాయిలు NPA గా వర్గీకరించబడినవి. దిగువ వివరించిన రుణఖాతాలో రుణగ్రహీతకు SARFAESI చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద పంపిన నోటీసు అందజేయబడకుండానే వాపసు వచ్చినది. అందువలన ఈ ప్రకటన తేదీ నుండి **60 రోజులలోగా** కాలం నం. 3లో వారి పేర్లకు ఎదురుగా తెలిపిన బకాయి మొత్తాలను తిరిగి చెల్లించాల్సిందిగా సంబంధిత రుణగ్రహీతలను ఇందుమూలంగా కోరబడుచున్నారు. లేనిచో అతని నుండి బకాయి మొత్తాలను రాబట్టు కొనుటకు సంబంధిత రుణఖాతాకు ఎదురుగా దిగువ తెలిపిన తనఖా పెట్టిన ఆస్తులపై SARFAESI యాక్ట్ లోని సెక్షన్ 13(4) క్రింద ప్రొసీడింగ్స్ చేపట్టుట **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, RACPC, ధర్మవరం, శ్రీసత్యసాయి జిల్లాకు** తప్పనిసరి అవుతుంది.

రుణగ్రహీతల పేర్లు & చిరునామాలు (1)	తనఖా పెట్టిన ఆస్తి వివరములు (2)	బకాయి మొత్తములు (రూ.) (3)
శ్రీ చెన్న నరేష్, తండ్రి చెన్న లక్ష్మీనారాయణ, డి.నం. 14-124, వార్డ్ నం. 14, పాండురంగ దేవాలయం వీధి, ధర్మవరం, శ్రీ సత్యసాయి జిల్లా **A/C No. 38191346164 (H/L)**	హిందూపురం RD మరియు ధర్మవరం SRD, ధర్మవరం గ్రామం, ధర్మవరం మున్సిపల్ ఏరియా, వార్డ్ నం. 19, లింగిశెట్టి పాల్యం వీధి (దిన్నూరు రోడ్డు), ధర్మవరం, శ్రీసత్యసాయి జిల్లాలో ఆస్తికలదు. **ఈ ఆస్తి రిజిస్టర్డ్ సేల్‌డీడ్ డాక్యుమెంట్ నం. 569/2019, తేది 25-01-2019 ప్రకారం శ్రీ చెన్న నరేష్, తండ్రి చెన్న లక్ష్మీనారాయణకు చెందినది.**	**15-02-2025** నాటికి రూ. **14,88,095/-** (పద్నాలుగు లక్షల ఎనభైఎనిమిది వేల తొంభై ఐదు రూపాయలు మాత్రమే) మరియు **16-02-2025** నుండి తదుపరి వడ్డీ, అనుషంగిక ఖర్చులు అధనం **NPA తేది: 14-02-2025**

బాబు సర్వే నం. A.C.
ప్రభుత్వ ఖుష్కి686-2 ఎ. 1-30 సెంట్లు మాస్టర్ ప్లాన్‌లో 0-11 సెంట్లు మరియు మిగిలిన ఎ. 1-19 సెంట్లు భూమి పైకి 0-03 సెంట్లు ప్లాట్ నం. 8లో, ఉత్తరం వైపు 0-01 ½ సెంట్లు.

సరిహద్దులు: తూర్పు: 18 అడుగుల వెడల్పురోడ్డు, **పడమర:** ప్లాట్ నం.5, **ఉత్తరం:** ప్లాట్ నం.7, **దక్షిణం:** గుజ్జల మంజులకు చెందిన ప్లాట్ నం.8.

కొలతలు : తూర్పు నుండి పడమర : 36 అడుగులు లేదా 10-972 మీటర్లు, **ఉత్తరం నుండి దక్షిణం:** 18 అడుగులు లేదా 5-486 మీటర్లు డోర్ నం. 19-321-4-1 లో ఈ మహాడి స్లాబ్ ఇల్లు, అసెస్‌మెంట్ నం. 1002030554.

ఇంటి కొలతలు: తూర్పు నుండి పడమర: 36 అడుగులు లేదా 10-972 మీటర్లు, **ఉత్తరం నుండి దక్షిణం:** 18 అడుగులు లేదా 5-486 మీటర్లు.
మహాడి కొలతలు : తూర్పు నుండి పడమర : 11 అడుగులు లేదా 3-352 మీటర్లు, **ఉత్తరం నుండి దక్షిణం:** 18 అడుగులు లేదా 5-486 మీటర్లు. **మొత్తం : 72.6 చ.గజాలు.**

తేది : 15-02-2025
ప్రదేశం : ధర్మవరం

సం/- అధీకృత అధికారి,
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, RACPC, ధర్మవరం, శ్రీసత్యసాయి జిల్లా